సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 28 । సెప్టెంబర్ । 2025



విద్యుత్ ఉద్యోగుల సమ్మె సైరన్

విద్యుత్ ఉద్యోగులు సమ్మె సైరన్ మోగించారు. అక్టోబరు 14 నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నారు.

- IIలో



వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గం - IIలో

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ న్యాయవాదులు నిరసన చేపట్టారు.

శ్రీముఖలింగం హుండీ లెక్కింపు రేపు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం హుండీ ఆదాయం సోమవారం లెక్కించనున్నామని ఈఓ టి.వాసుదేవరావు శనివారం తెలిపారు. ఆలయ అధికారులు, అర్చకులు సమక్షంలో హుండీ తెరిచి ఆదాయం లెక్కించనున్నామని చెప్పారు. భక్తులు నిబంధనలు పాటించి డ్రెస్‌కోడ్‌తో హాజరుకావచ్చని పేర్కొన్నారు.

దేవీ వైభవం

నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండువగా సాగుతున్నాయి. అమ్మవారి ఆలయాలు, మంటపాల వద్ద ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. శనివారం నందిగాంలో నీలమణి దుర్గ అమ్మవారికి 121 రకాల ప్రసాదాలతో నైవేద్యం సమర్పించారు. పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారు లలితా త్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

– నందిగాం/పాతపట్నం



నందిగాంలో అమ్మవారికి 121 రకాల ప్రసాదాల నివేదన



పాతపట్నంలో లలితా త్రిపురసుందరిగా నీలమణిదుర్గ

సంప్రదాయాలకు నెలవు..

బొమ్మల కొలువు



వధూవరుల చందనపు బొమ్మలు




శ్రీకాకుళం గుడివీధిలో బొమ్మల కొలువు



కొండపల్లి బొమ్మలు

- దసరా నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా బొమ్మల కొలువు
- తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయం
- పురాణేతిహాసాల్లో ఘట్టాలను వివరిస్తున్న వైనం

శ్రీకాకుళం కల్చరల్:



దసరా అంటేనే సందడి. సంస్కృతి సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ దేవీ శరన్ననవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తుంటారు. ఇందులో బొమ్మల కొలువులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ప్రస్తుత యువ తరానికి బొమ్మల కొలువు అంటే ఏదో కొత్తమాటలా అనిపిస్తున్నా నేటికీ కొన్ని కుటుంబాలు దశబ్దాలుగా బొమ్మల కొలువులు ఏర్పాటు చేస్తున్నాయి. తరతరాల సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నాయి. పురాణ ఇతిహాసాల్లోని ప్రముఖ ఘట్టాల్లోని ఆంతర్యాన్ని తెలియజేస్తున్నాయి.

అంతా ప్రత్యేకమే..

దసరాలో తొమ్మిది రోజుల పాటు ఇళ్లల్లో బొమ్మల కొలువులు ఏర్పాటు చేస్తుంటారు. దీనికోసం ఇంట్లో ప్రత్యేకంగా గదిని కేటాయిస్తారు. బొమ్మలు పేర్చడం కాస్త కష్టంతో కూడుకున్న పనే అయినప్పటికీ ఎంతో ఇష్టంగా చేస్తుంటారు. తొమ్మిది మెట్లు ఏర్పాటు చేసి సంప్రదాయబద్ధంగా బొమ్మలను కొలువుదీర్చుతారు. ఎలాపడితే అలా అమర్చకుండా సందేశాత్మకంగా బొమ్మలను పెట్టాల్సి ఉంటుంది. మట్టి, కొయ్య, పింగాణి, ప్లాస్టర్ ఆఫ్ పారిస్.. ఇలా అన్ని రకాల బొమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

భద్రపరచడం కష్టమే..

బొమ్మల కొలువు పూర్తయ్యాక వాటిని భద్రపరచడం కీలకమని చెబుతున్నారు నిర్వాహకులు. దీనికి ఎంతో ఓపిక, సహనం ఉండాలంటున్నారు. మళ్లీ బొమ్మలు కొలువు వచ్చే వరకు వాటి రంగులు ఊడిపోకుండా వాటిని జాగ్రత్తగా పెట్టెల్లో కాపాడుకుంటామని వారు వివరించారు.

ఎన్నెన్నో బొమ్మలు..

దుర్గాదేవితో పాటు రాముడు, కృష్ణుడు, వినాయకుడు, లక్ష్మీ, సరస్వతీ, పార్వతి, పెళ్లితంతు, జంతువులు, పక్షులు, పండ్లు, చెట్ల ఆకులు, పురాతన కట్టడాలు, ప్రయాణ సాధనాలు, వాహనాల.. ఇలా రకరకాల బొమ్మలు ఈ కొలువుల్లో కనువిందు చేస్తుంటాయి. వీటిని చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపుతున్నారు.

చిన్నతనం నుంచి..



నా చిన్నప్పుడు అమ్మ బొమ్మల కొలువు పెట్టేవారు. అప్పటి పాతబొమ్మలు రంగులు వెలసిపోతే వాటికి కొత్తగా రంగులు వేయించి జాగ్రత్తగా కాపాడుకుంటున్నాను.

– కె.విజయలక్ష్మి, గుడివీధి, శ్రీకాకుళం

80 ఏళ్లు దాటినా..



మా పెద్దలు బొమ్మలు కొలువు పెట్టేవారు. ఆ సంప్రదాయాల్ని కొనసాగిస్తున్నాం. నాకు 80 ఏళ్లు పైబడినా ఇప్పటికీ బొమ్మల కొలువు అంటే ఇష్టమే.

– మందా జగదాంబ, కత్తెరవీధి, శ్రీకాకుళం


50 ఏళ్లుగా కొలువు



మా ఇంట్లో 50 ఏళ్లుగా బొమ్మల కొలువు పెడుతున్నాను. 10 రోజుల ముందు నుంచే కష్టపడాల్సి వస్తుంది. ఒక్కొక్కసారి రాత్రి రెండు గంటల వరకు ఉండి బొమ్మలు పేరుస్తాం.

– గిరిజా పద్మజ, శ్రీకాకుళం

1, 2 తేదీల్లో కిరణ దర్శనం



గర్భాలయంలో మూలవిరాట్టును తాకిన కిరణాలు (ఫైల్)

అరసవల్లి: అరుదైన అద్భుత దృశ్యానికి వేళయ్యింది. అక్టోబర్ 1, 2 తేదీల్లో అరసవల్లిలో ఆదిత్యుని మూలవిరాట్టుపై తొలి సూర్యకిరణాలు స్పృశించే అరుదైన అద్భుత దర్శనం కన్పించనుంది. సూర్యోదయ సమయాన సాక్షాత్కరించనున్న ఈ కిరణ దర్శనం కోసం రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు అరసవల్లి క్షేత్రానికి రానున్నారు. ఉత్తరాయణ, దక్షిణాయన కాలమార్పుల్లో భాగంగా ఆలయ గర్భాలయంలో కొలువైన ప్రత్యక్ష దైవం సూర్యనారాయణ స్వామి పాదాలను నేరుగా తొలి సూర్యకిరణాలు తాకనున్నాయి. రానున్న బుధ, గురు వారాల్లో కన్పించనున్న ఈ అద్భుత దర్శనానికి సంబంధించిన ఏర్పాట్లపై ఆలయ ఈవో కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్, ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మలు ఇప్పటికే చర్చించారు. దసరా సెలవుల నేపథ్యంలో పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఎక్కడా ఇబ్బంది లేకుండా, సూర్యకిరణాలకు అడ్డం రాకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. ఈ సందర్భంగా శంకరశర్మ 'సాక్షి'తో మాట్లాడుతూ వాతావరణం అనుకూలిస్తే కిరణ దర్శనం ఉంటుందన్నారు.

యూరియా కోసం తప్పని నిరీక్షణ

పాతపట్నం: యూరియా కోసం రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. పాతపట్నం మండలం లాబర గ్రామంలో సింగుపురం రైతు సేవా కేంద్రానికి సంబంధించిన యూరియా వచ్చిందని తెలియడంతో ఒకేసారి రైతులందరూ శనివారం తరలివచ్చారు. లాబర, సింగుపురం, బోరుబద్ర, సన్యాసిరావుపేట, బగదల, రట్టిణి, గురండి గ్రామాలకు చెందిన రైతులు పెద్ద ఎత్తున చేరుకుని పడిగాపులు కాశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ కె.మధుసూదనరావు, వ్యవసాయాధికారి పి.కిరణ్‌వాణి, ఏఈవో టి.భారతీలు చేరుకుని ఒక్కో రైతుకు ఒక్క బస్తా చొప్పున పంపిణీ చేశారు.



లాబరలో యూరియా కోసం రైతుల పడిగాపులు

ఇకపై ప్రతిరోజూ బరంపురం–విశాఖ ప్యాసింజర్ రైలు

కంచిలి: బరంపురం–విశాఖపట్నం(58531), విశాఖపట్నం–బరంపురం(58532) పాసింజర్ రైలు ఇకపై ప్రతిరోజూ నడుస్తుందని ఈస్ట్‌కోస్ట్ రైల్వే జెడ్ ఆర్‌యూసీసీ సభ్యుడు శ్రీనివాస్ రౌళో శనివారం తెలిపారు. నాన్ ఇంటర్ లాకింగ్ పనుల నేపథ్యంలో నెలరోజులుగా వారానికి మూడు రోజులు మాత్రమే నడిచేదని, పనులు పూర్తికావడంతో ప్రతిరోజూ అందుబాటులో ఉంటుందని చెప్పారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.



సచివాలయ ఉద్యోగుల చలో కలెక్టరేట్



శ్రీకాకుళంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోరుతూ శనివారం సచివాలయం ఉద్యోగులు చలో కలెక్టరేట్ నిర్వహించారు. శ్రీకాకుళం ఆర్అండ్‌బీ వసతి గృహం రోడ్డుపై రాత్రి వరకు నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు విన్నవించినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. రెండు నోషనల్ ఇంక్రిమెంట్ల బకాయిలు చెల్లించాలని, తొమ్మిది నెలల ఎరియర్స్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వలంటీర్ల పనులు కూడా ఉద్యోగులతో చేయించడం ఆపాలని, గ్రామ స్థాయిలో నాయకుల నుంచి వేధింపులు అరికట్టాలన్నారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు బి.మధుబాబు, ప్రధాన కార్యదర్శి బి.జగదీష్‌బాబు, పి.నారాయణరావు, ఎం.రవికుమార్, వెంకటేశ్వర్లు, సంగయ్య, ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు తప్పెటగుళ్ల బృందం

నరసన్నపేట: నారాయణవలసకు చెందిన శ్రీవెంకట రమణ తప్పెటగుళ్ల బృందం తిరుమల బ్రహ్మోత్సవాల్లో ఆదివారం ప్రదర్శన ఇవ్వనుంది. ఈ మేరకు దేవస్థానం నుంచి ఆహ్వానం వచ్చింది. దీంతో 25 మందితో కూడిన బృందం తిరుమలకు పయనమైంది. ఆదివారం గరుడ సేవతో పాటు మరుసటి రోజు గజవాహన సేవలో పాల్గొని ప్రదర్శన ఇవ్వనున్నట్లు కమిటీ ప్రతినిధి శిమ్మ లక్ష్మణరావు తెలిపారు. గడిచిన 16 సంవత్సరాలుగా బ్రహ్మోత్సవాల్లో పాల్గొంటున్నామని చెప్పారు.

కానిస్టేబుల్ అరెస్టు

టెక్కలి రూరల్: దమ్ము గోపాలం అనే పోలీస్ కానిస్టేబుల్ అరెస్టయిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై టెక్కలి సీఐ ఎ.విజయ్‌కుమార్ మాట్లాడుతూ గోపాలం గతంలో టెక్కలిలో కానిస్టేబుల్‌గా పనిచేసి ప్రస్తుతం పలాసలో విధులు నిర్వర్తిస్తున్నాడని, తనను మోసం చేశాడంటూ టెక్కలిలో ఉంటున్న ఓ మహిళ ఈ నెల 16న ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం విచారణ జరిపి కానిస్టేబుల్‌ను జిల్లా జైలుకు తరలించినట్లు చెప్పారు.

విదేశీ పక్షులను సంరక్షించుకుందాం



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, గ్రామస్తులు

ఇచ్ఛాపురం రూరల్: వేలాది కిలోమీటర్ల దూరం నుంచి తేలుకుంచి వస్తున్న విదేశీ పక్షులు, సైబీరియన్ కొంగలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఇచ్ఛాపురం తహసీల్దార్ ఎన్.వెంకటరావు అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శనివారం తేలుకుంచి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాతిర్ల రాజశేఖరరెడ్డి, ఎంపీడీఓ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కె.రామారావు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

డిజిటల్ బుక్‌తో..
వైఎస్సార్‌సీపీ శ్రేణులకు భరోసా

- బాధితులు వినియోగించుకోవాలి
- డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరణలో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం



డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఎక్కడ ఎటువంటి అన్యాయం జరిగినా వెంటనే డిజిటల్ బుక్‌లో లాగిన్ అయి వివరాలు నమోదు చేస్తే పార్టీ అండగా ఉంటుందని శ్రీకాకుళం పార్లమెంట్ సమన్వయకర్త, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం భరోసా ఇచ్చారు. వేధింపులు, ఇబ్బందులు ఎదురైతే డిజిటల్ బుక్‌లో ఫోన్ నెంబర్, ఇతర వివరాలు పొందుపరచాలని కోరారు. శ్రీకాకుళంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శనివారం డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను పార్టీ ముఖ్య నాయకులతో కలిసి సీతారాం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో జరిగిన పార్టీ సర్వసభ్య సమావేశంలో అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను ప్రవేశపెట్టారని చెప్పారు. దీనిని అన్ని నియోజకవర్గాలు, మండలాల్లో రిలీజ్ చేసి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అండగా నిలవాలన్నారు. ఇప్పటికే చాలామంది పార్టీ సానుభూతిపరులకు, కార్యకర్తలకు తీవ్ర అన్యాయం జరిగిందని, వాటిపై న్యాయస్థానాల్లో పోరాటం చేస్తూనే ఉన్నామన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినవెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. డిజిటల్ బుక్‌ను టీడీపీ నేతల రెడ్ బుక్ మాదిరి పెట్టుకున్నా మని చెప్పడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. ప్రజలకు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ఎవరికి ఎక్కడ ఏ అన్యాయం జరిగినా సులువుగా సమాచారం తెలుసుకునేందుకు డిజిటల్ బుక్ పెట్టామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు, పార్టీ రాష్ట్ర కాళింగ కుల అధ్యక్షుడు దుంపల రామారావు, వెలమ కుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, కళింగ వైశ్య కుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు, పార్టీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మార్పు పృథ్వీ, పార్టీ సంయుక్త కార్యదర్శి ఎన్ని ధనుంజయరావు, నగర అధ్యక్షుడు సాధు వైకుంఠరావు, చిట్టి జనార్దనరావు, గ్రీవెన్స్‌సెల్ జిల్లా అధ్యక్షుడు రౌతు శంకరరావు, ఎంఏ బేగ్, సనపల నారాయణరావు, వై.వి.శ్రీధర్, యజ్జల గురుమూర్తి, బొడ్డేపల్లి పద్మజ, తంగుడు నాగేశ్వరరావు, గుండ హరీష్, సిహెచ్ భాస్కర్, రుప్ప అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈఈ బాధ్యతల నుంచి తప్పించండి

శ్రీకాకుళం: శ్రీకాకుళం ఏపీహెచ్ఎంహెచ్ఐడీసీకి ఇన్‌చార్జి ఈఈ ఉన్నటువంటి తనను ఆ బాధ్యతల నుంచి తప్పించాలని ప్రమోద్‌కుమార్ ప్రధాన కార్యాలయానికి లేఖ రాసినట్లు తెలిసింది. విశాఖపట్నంలోని ఇదే విభాగంలో క్వాలిటీ కంట్రోల్ డీఈఈగా పనిచేస్తున్న ఆయనను ఈనెల 1వ తేదీన ఇన్‌చార్జి ఈఈగా నియమించారు. ఆయన బాధ్యతలు చేపట్టినప్పటికీ.. తరచూ సెలవు పెడుతూ వస్తున్నారు. ఐదు రోజుల క్రితం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ రిమ్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంలో ఇంజినీరింగ్ అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ నేపథ్యంలో సెలవు పెట్టిన ప్రమోద్ కుమార్ శనివారం ప్రధాన కార్యాలయానికి వెళ్లి లిఖితపూర్వకంగా తనను ఈ బాధ్యతల నుంచి తప్పించాలని కోరినట్లు తెలిసింది. ఈ విషయంపై సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు. డీఈఈ సిమ్మన్న వద్ద ప్రస్తావించగా లేఖ రాసిన విషయం తెలిసిందని, అయితే దీనిని అధికారికంగా ధ్రువీకరించుకోవాల్సి ఉందని తెలిపారు.

భార్య మందలించిందని...

నరసన్నపేట: మండలంలోని కంబకాయకు చెందిన కెల్ల రాజారావు(34) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం సాయంత్రం గడ్డి మందు తాగడంతో కుటుంబసభ్యులు గమనించి నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మరణించినట్లు నరసన్నపేట ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. భార్య రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా సరుబుజ్జిలి మండలం చిగురువలసకు చెందిన రాజారావు కంబకాయకు చెందిన రామలక్ష్మిని వివాహం చేసుకొని ఇక్కడే ఇల్లరికం ఉంటున్నారు. అప్పుడప్పుడు భార్యాభర్తల మధ్య చిన్న చిన్న మనస్పర్థలు ఉన్నట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగా శుక్రవారం ఉదయం వీరిద్దరూ ఘర్షణ పడగా, భార్య రామలక్ష్మి రాజారావును మందలించింది. దీనిని తట్టుకోలేక రాజారావు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా రాజారావుకు ఇద్దరు కుమారులు ఉన్నారు.


మృతుడు రాజారావు (ఫైల్)

వలంటీర్ విభాగ అధ్యక్షుడిగా గంట్యాడ రమేష్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ వాలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా గంట్యాడ రమేష్‌ని నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి శనివారం ఆదేశా లు జారీ చేశారు. ఈయన ఆమదాలవలస నియోజకవర్గం పొందూరు మండలానికి చెందిన వ్యక్తి. పలువురు అభినందనలు తెలిపారు.


గంట్యాడ రమేష్

విద్యుత్ ఉద్యోగుల సమ్మె సైరన్


ఇటీవల శ్రీకాకుళంలో శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ ఉద్యోగులు (ఫైల్)

- అక్టోబరు 14 నుంచి నిరవధిక సమ్మె

అరసవల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేస్తున్న విద్యుత్ పంపిణీ సంస్థల యాజమాన్యాలపై ఆ శాఖ ఉద్యోగులు, కార్మికులు నిరసనలకు దిగనున్నారు. ఇదివరకే పలు రకాలుగా శాంతియుత నిరసనలు, ధర్నాలు చేపట్టిన విద్యుత్‌శాఖ ఉద్యోగులు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు సంయుక్తంగా జేఏసీ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె చేపట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో యాజమాన్యంతో జరిగిన చర్చలు సఫలం కాకపోవడంతో జేఏసీ ఆధ్వర్యంలో అక్టోబర్ 6 నుంచి నిరసన కార్యక్రమాలకు సంబంధించి షెడ్యూల్ ఖరారు చేశారు. ఈ క్రమంలో అక్టోబర్ 14 నుంచి అన్ని విద్యుత్ సర్కిల్ కేంద్రాల వద్ద ఉద్యోగ, కార్మికులంతా విధులను నిలిపివేసి నిరవధిక సమ్మెకు దిగనున్నారు. వినియోగదారులకు కలగనున్న ఇబ్బందులకు రాష్ట్ర ప్రభుత్వం, డిస్కం యాజమాన్యాలే బాధ్యత వహిస్తాయని జేఏసీ ప్రతినిధులు హెచ్చరిస్తున్నారు.

నిరసనల షెడ్యూల్ ఇలా..

- అక్టోబరు 6న విశాఖపట్టణం ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం వద్ద ధర్నా
- 8న ఎస్‌పీడీసీఎల్ తిరుపతి కార్పొరేట్ కార్యాలయం వద్ద ధర్నా
- 13న ఛలో విజయవాడ కార్యక్రమం
- 14 నుంచి నిరవధిక సమ్మె
- అనంతరం ప్రభుత్వ నిర్ణయాలపై జేఏసీ ప్రతినిధులు స్పందన మేరకు చర్యలు

ఇంటి నిర్మాణంపై వివాదం


ఇరువర్గాలతో మాట్లాడుతున్న అధికారులు

కొత్తూరు: మండలంలోని కడుము కాలనీలో ఇంటి నిర్మాణం, ఖాళీ స్థలంపై రెండు వర్గాల మధ్య శనివారం వివాదం చెలరేగింది. కాలనీలో ఎస్సీ సామాజికవర్గానికి చెందిన ఎం.అప్పారావు నిర్మిస్తున్న ఇంటికి స్లాబ్ వేసేందుకు శనివారం ఏర్పాట్లు చేశారు. అయితే అప్పారావు ప్రభుత్వ పాఠశాలకు చెందిన స్థలంలో ఇంటి నిర్మాణం చేస్తున్నందున పనులు నిలుపుదల చేయాలని కాలనీకి చెందిన వి.గోవిందరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ముందు ఆందోళన చేపట్టారు. విషయం తెలియడంతో స్థానిక సీఐ చింతాడ ప్రసాద్, ఎస్ఐ ఎండీ అమీర్ అలీ తమ సిబ్బందితో చేరుకున్నారు. అనంతరం తహసీల్దార్ కె.బాలకృష్ణకు ఫిర్యాదు చేయడంతో ఆయన ఇంటి పనుల వద్దకు చేరుకున్నారు. రికార్డులు పరిశీలించిన తర్వాత అప్పారావు నిర్మిస్తున్న ఇల్లు జిరాయితీ స్థలంలో ఉందని స్పష్టం చేశారు. అనంతరం పనులు చేపట్టేందుకు అప్పారావు సమాయత్తమయ్యారు. పాఠశాల స్థలంలో పనులు చేపడితే అడ్డుకోవడం తప్పదని గ్రామస్తులు కొంత మంది అధికారులకు తెలిపారు. ఇల్లు నిర్మిస్తున్న స్థలంతో పాటు పాఠశాల స్థలాన్ని కడుము కాలనీకి చెందిన ఒకరు గతంలో దానం చేశారని, అందుకు సంబంధించిన ఆధారాలు అక్టోబర్ 5వ తేదీన సమర్పిస్తామన్నారు. దీంతో అప్పటి వరకు పనులు నిలుపుదల చేయాలని తహసీల్దార్ ఆదేశించడంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది.

సోషల్ మీడియా పోస్టులపై నిఘా

- 134 కేసుల్లో 106 మంది అరెస్టు
- డీఐజీ గోపినాథ్ జెట్టి

శ్రీకాకుళం క్రైమ్: సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తూ, మహిళలను అగౌరవపరిచేలా అభ్యంతరకర పోస్టులు పెడుతున్నవారిపై గట్టి నిఘా పెట్టామని విశాఖపట్నం రేంజి డీఐజీ గోపినాథ్ జెట్టి హెచ్చరించారు. రేంజి పరిధిలోని శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం–మన్యం జిల్లాల ఎస్పీలతో పాటు డీఎస్పీలతో వర్చువల్‌గా సమీక్షా సమావేశం శనివారం నిర్వహించారు. పోస్టులు మితిమీరుతుండడంతో ప్రతీ జిల్లాలో పర్యవేక్షణకు నోడల్ అధికారిని నియమించి, ప్రత్యేక బృందాల ద్వారా సాంకేతిక పరిజ్ఞానంతో అభ్యంతరకర పోస్టులు పెట్టేవారిని గుర్తించాలన్నారు. వారు పెట్టిన పోస్టు ఏ కేటగిరీకి వస్తుంది.. వారిపై ఎటువంటి చర్యలు చేపట్టారన్న అంశాలపై రోజువారి నివేదిక తనకు పంపాలని అధికారులను ఆదేశించారు. గుర్తించిన వ్యక్తుల వివరాలు సేకరించి, వారికి సహకరిస్తున్న వ్యక్తులను వ్యవస్థీకృత నేరమునకు సంబంధించిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలన్నారు.


వర్చువల్‌గా ఎస్పీలు, డీఎస్పీలతో మాట్లాడుతున్న డీఐజీ గోపినాథ్ జెట్టి

106 మంది అరెస్టు

రేంజి పరిధిలో అభ్యంతరకర పోస్టులు పెట్టిన 134 మందిపై కేసులు నమోదు చేసి, 106 మందిని అరెస్టు చేశామని, 57 కేసుల్లో ఛార్జిషీటు దాఖలు చేసి 25 కేసుల్లో విచారణ ప్రారంభమైందన్నారు. డీఎస్పీలు వారి పరిధి స్టేషన్లలో ఈ కేసులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కేసుల్లో త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. అభ్యంతరకర పోస్టులు పెడుతున్న వ్యక్తులు చట్టం నుంచి తప్పించుకోలేరన్నది స్పష్టం చేయాలన్నారు.

సైకో ఎవరనేది ప్రజలకు తెలుసు

- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నిండు శాసనసభలో పద్ధతి లేకుండా జేబులో చెయ్యిపెట్టుకుని, కళ్లద్దాలు నెత్తిన పెట్టుకుని సభా సంప్రదాయాలు పాటించకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడిన బాలకృష్ణ సైకోనా.. పద్ధతిగా ఉండే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైకోనా అనేది ప్రజలందరికి తెలుసునని మాజీ శాసనసభాపతి, శ్రీకాకుళం పార్లమెంటరీ పరిశీలకుడు తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలసలో శనివారం ఆయన సాక్షితో మాట్లాడుతూ గతంలో బెల్లంకొండ సురేష్‌పై కాల్పులు జరిపిన బాలకృష్ణను కాపాడింది ఆనాటి సీఎం దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి అని గుర్తు చేశారు. వైఎస్సార్ కుటుంబాన్ని ఒక్క మాట కూడా అనే హక్కు వారికి లేదన్నారు. సినీ పరిశ్రమ, సినిమా హీరోలకు జగన్‌మోహన్‌రెడ్డి అంటే చాలా అభిమానం ఉందన్నారు. కరోనా సమయంలో చిరంజీవి, సినిమా హీరోలంతా కలుస్తామని అడిగితే అన్ని రకాల మర్యాదలతో కలిసి సినీ ఇండస్ట్రీ సమస్యలు పరిష్కరించింది జగన్ అని గుర్తు చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి సైకో అని వ్యాఖ్యానించిన బాలకృష్ణ పూర్తిగా మెంటలైపోయాడేమోనని అనిపిస్తుందన్నారు. కరోనా నిబంధనల మేరకే ఐదుగురికి అవకాశం ఇస్తే చాలదు అంటే 10 మందికి అవకాశం కల్పించి విందు ఇచ్చి మరి మర్యాద చేశారని చెప్పారు. బాలకృష్ణ ఏ రకమైన సైకోనో నాకు బాగా తెలుసునని, టీడీపీలో చాలాకాలం ప్రయాణం చేశానన్నారు. బాలకృష్ణకు ఎవరైనా ఫోన్ చేస్తే ఎవడ్రా.. అని నోటికొచ్చినట్లు పిచ్చోడిలా మాట్లాడతాడని అన్నారు. వైఎస్సార్ దయాదాక్షిణ్యాలతో బతుకుతున్నావన్న విషయం మరిచిపోకూడదన్నారు. పవన్, చిరంజీవి ఫ్యామిలీలతో బాలకృష్ణకు ఏమైనా పొరపొచ్చాలుంటే మీరు మీరు తేల్చుకోవాలి తప్ప జగన్‌పై అవాకులు, చవాకులు మాట్లాడితే సహించేది లేదన్నారు. బాలకృష్ణ తీరు మార్చుకోకుంటే వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

రవాణా సదుపాయాలతో అభివృద్ధి

- కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

ఆమదాలవలస: ఏదైనా ప్రాంతం అభివృద్ధి చెందాలంటే రవాణా సదుపాయాలు అత్యంత ముఖ్యమని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించిన బెర్హంపూర్ – సూరత్ (ఉద్నా) అమృత్ భారత్ రైలును శనివారం శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వే స్టేషన్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమృత్ భారత్ రైలు దేశ రైల్వే రూపురేఖలు మార్చిందన్నారు. శ్రీకాకుళం, పలాసలో రెండు హాల్ట్‌లు ఇచ్చినట్లు తెలిపారు. విమానాల్లో ఉండే సదుపాయాలు అమృత్ భారత్ రైళ్లలో ఉన్నాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రైల్వే డీఆర్ఎం లలిత్ బొహ్రా, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఆర్డీవో సాయి ప్రత్యూష, డీసీసీబీ అధ్యక్షుడు శివ్వల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


అమృత్ భారత్ రైలు ప్రారంభిస్తున్న దృశ్యం

ఉద్దానం ప్రజలకు వరం

పలాస: బరంపురం నుంచి సూరత్ వెళ్లే అమృత్ భారత్ రైలు ఉద్దానం ప్రాంత ప్రజలకు వరం లాంటిదని ఖుర్దా ఏఆర్‌డీఎం ప్రమోదకుమార్ బెహరా అన్నారు. పలాస రైల్వేస్టేషన్‌లో రైలు స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతం నుంచి ఎక్కువ మంది సూరత్, కాండ్ల, గుజరాత్, రాయపూర్, బిలాయ్ తదితర ప్రాంతాలకు వలస వెళ్తుంటారని, వారికి ఈ రైలు చాలా ఉపయోగమన్నారు. కార్యక్రమంలో డీసీఎం సుక్రాంబరో, పలాస రైల్వే మేనేజర్ ఎస్‌కే దాసు, పలాస – కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంకెంత కాలం రైతులు రోడ్డెక్కాలి..?


తహసీల్దార్ వెంకటరావుకు వినతిపత్రం అందజేస్తున్న పిరియా విజయ తదితరులు

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

ఇచ్ఛాపురం రూరల్: ముఖ్యమంత్రిగా చంద్రబాబు పాలించిన ప్రతిసారీ రైతులు ఏదో సమస్యతో రోడ్డెక్కాల్సిన పరిస్థితి దాపురించిందని, ఇంకెంత కాలం ఇలా రైతులు రోడ్డెక్కాలని జెడ్పీ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా విజయ ప్రశ్నించారు. రైతు పోరులో భాగంగా శనివారం ఆమె రైతులు, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి యూరియా కష్టాలపై స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ఏడాది మండలంలో సుమారు 8 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తుంటే, కేవలం 320 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. దీంతో రైతులు అధిక మొత్తాన్ని చెల్లించి ఒడిశాలో యూరియాను కొనుక్కునే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కోసం ప్రభుత్వం ఇస్తున్న యూరియాను కూటమి నాయకులు తమకు అనుకూలమైన రైతులకు మాత్రమే ఇస్తున్నారన్నారు. దీంతో ఎక్కువ మంది రైతులు యూరియా కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పూర్తిస్థాయిలో యూరియాను అన్నదాతలకు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ ఎస్.వెంకటరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షుడు నర్తు ప్రేమ్‌కుమార్, మండల కన్వీనర్ పి.రాజశేఖరరెడ్డి, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, నాయకులు సల్ల దేవరాజు, కారంగి మోహనరావు, తడక జోగారావు, దక్కత నూకయ్యరెడ్డి, ఎస్.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గం


- వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ ఆధ్వర్యంలో నిరసన

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్రంలో వైద్య కళాశాలలను పీపీపీ విధానం పేరిట ప్రైవేటీకరణకు సిద్ధం కావడం దుర్మార్గమని, కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆరంగి లక్ష్మీపతి డిమాండ్ చేశారు. వైద్య కళాశాలల పీపీపీ విధానాన్ని నిరసిస్తూ లీగల్ సెల్ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జరిగాయి. దీనిలో భాగంగా పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీపతి, యువ నాయకుడు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు ఆధ్వర్యంలో లీగల్ సెల్ సభ్యులు, న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. ముందుగా ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో సమావేశమై అక్కడి నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు తరలివచ్చారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టారని గుర్తు చేశారు. అందులో ఐదు కళాశాలల నిర్మాణాలు పూర్తిచేసి ప్రారంభోత్సవం చేపట్టగా, మరికొన్ని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఈ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రయివేటు వ్యక్తులకు అప్పగించేందుకు సిద్ధం కావడం దారుణమన్నారు. పీపీపీ విధానంతో మెడికల్ సీట్లు అమ్ముకునే పరిస్థితి వస్తుందని, దీనివల్ల పేద, మధ్య తరగతి కుటుంబాలకు వైద్య విద్య అందని అందని ద్రాక్షలా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమంలో లీగల్‌సెల్ ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదరరావు, సీనియర్ న్యాయవాది తంగి శివప్రసాదరావు, న్యాయవాదులు పొన్నాడ రుషి, కూన అన్నంనాయుడు, గణపతినాయుడు, విజయ్‌కుమార్, నీలాద్రి, సుధాబాల, అప్పారావు పట్నాయకుని, ఉషా తదితరులు పాల్గొన్నారు.


జేసీకి వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ప్రతినిధులు ఆరంగి లక్ష్మీపతి తదితరులు

గంగమ్మ తల్లి గుడిలో చోరీ

నరసన్నపేట: మండలంలోని చెన్నాపురంలో ఉన్న గంగమ్మ తల్లి గుడిలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. సుమారు రూ.50 వేలు విలువ కలిగిన వస్తువులు చోరీకి గురైనట్లు ఆలయ ధర్మకర్త ముత్తా సింహాచలం తెలిపారు. గంగమ్మ తల్లి విగ్రహం మెడలో ఉన్న రెండు గ్రాముల బంగారు శతమానం, మూడు గ్రాముల వెండితో ఉన్న మట్టెలను దోచుకెళ్లారని తెలిపారు. అలాగే హుండీని ఎత్తుకుపోయారన్నారు. హుండీలో రూ.20 వేల వరకూ నగదు, కొన్ని వెండి వస్తువులు ఉంటాయని వివరించారు. ప్రతి ఏటా నవంబర్ నెలలో హుండీ లెక్కించి వచ్చిన డబ్బుతో అన్నదానం చేస్తామని, ఇంతలో దొంగలు చోరీకి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.


గుడి తలుపుల తాళం తీసి ఉన్న దృశ్యం

వ్యాపారస్తులు ముందుకు రావాలి

- జీఎస్టీ డిప్యూటీ కమిషనర్, నోడల్ ఆఫీసర్ స్వప్న దేవి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జీఎస్టీ తగ్గిన నేపథ్యంలో ధరలు తగ్గించేందుకు వ్యాపారస్తులు వాలంటీర్‌గా ముందుకు రావాలని జీఎస్టీ డిప్యూటీ కమిషనర్, సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ నోడల్ అధికారి స్వప్నదేవి కోరారు. నగరంలోని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జీఎస్టీ ధరల తగ్గింపుపై వ్యాపారస్తులతో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యావసర వస్తువులు, ఎలక్ట్రానిక్స్, మెడికల్, ఆటోమొబైల్స్, వ్యవసాయానికి సంబంధించి యంత్రాలు, ఎరువులు, ప్యాకింగ్ మెటీరియల్, హెల్త్ ఇన్సూరెన్స్‌పై తగ్గింపులు వలన ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ప్రజల వద్ద డబ్బులు ఉంటే మరింతగా వ్యాపారాలు జరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు షాపుల వద్ద పాత ధరలు, కొత్త ధరల బ్యానర్లు ప్రదర్శించాలని సూచించారు. వ్యాపారస్తులకు ఉన్న అనుమానాలను జీఎస్టీ నోడల్ అధికారి నివృత్తి చేశారు. సమావేశంలో అసిస్టెంట్ జీఎస్టీ అధికారి చంద్రకళ, కాశీబుగ్గ, నరసన్నపేట, ఆమదాలవలస అసిస్టెంట్ జీఎస్టీ అధికారులు, బంగారం వ్యాపారస్తులు, రైస్ మిల్లర్స్, హోటల్స్, కిరాణా, ఆటోమొబైల్స్, సిమెంటు తదితరులు వ్యాపారస్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ స్వప్న దేవి